క్లుప్తంగా

గోళ్ళపాడులో ఫ్యామిలీ పిజిషియన్



గోళ్ళపాడు(ముప్పాళ్ళ): మండలంలోని గోళ్ళపాడు గ్రామంలో ఫ్యామిలీ పిజిషియన్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు సీ.హెచ్.భరద్వాజ, ఎస్.సూర్యప్రకాశరావులు పాల్గొని 104 మందికి వైద్య సేవలందించారు. వీరిలో ఇద్దరికి ఈసీజీ చేశారు. మధ్యాహ్నం ఎంపీయూపీ స్కూల్‌ను సందర్శించి పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందించారు. మంచానికే పరిమితమైన వారి ఇళ్లకు వెళ్లి వైద్యసేవలందించారు. కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌పీ బి.అంజలి, హెచ్.వి భవాని, ఏఎన్ఎమ్ ఎమ్.ఆదిలక్ష్మి, పి.శోభారాణి, డీఈఓ రవితేజ, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాదలలో ఆధార్ సేవలు ప్రారంభం



మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం ఆదేశాల మేర ఆధార్ కేంద్రం ద్వారా సేవలను ప్రారంభించారు. మండల పరిధిలోని ఐదు గ్రామాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పీ.పుట్టారెడ్డి తెలిపారు. ముప్పాళ్ళ గ్రామ సచివాలయం, నార్నెపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల, దమ్మాలపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల, బొల్లవరం జెడ్పీ ఉన్నత పాఠశాల, గోళ్ళపాడు కేజీబీవీ పాఠశాలల్లో ఆధార్ క్యాంపులు నిర్వహించి, ఆధార్ కార్డులో చేర్పులు, మార్పులు, సవరణలు చేసుకునే వీలుంటుందన్నారు. మండల వాసులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాదల జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

నిర్మాణంలో ఉన్న పాలిటెక్నిక్ కళాశాలను పరిశీలించిన ఎమ్మెల్యే



క్రోసూరు: త్వరలో ప్రారంభం కానున్న ప్రభుత్వ పాలిటెక్నిక్‌కళాశాల నూతన భవనంలో జరుగుతున్న పనులను ఎమ్మెల్యే నంబూరు శంకరరావు బుధవారం పరిశీలించారు. త్వరలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదగా ప్రారంభోత్సవం జరుపుకోవాల్సి ఉన్నందున శరవేగంగా పనులు పూర్తిచేయాలని సంబంధిత అధికారులను సూచించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



నకరికల్లు: విద్యుత్‌షాక్‌కు గురై వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని కుంకలగుంట గ్రామంలో బుధవారం జరిగింది. ఘటనకు సంబంధించిన పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన మాదినీడి శ్రీనివాసరావు (52) కాంట్రాక్ట్ విద్యుత్ కార్మికునిగా పనిచేసి జీవనోపాధి పొందుతున్నాడు. బుధవారం గ్రామంలోని గుడి సమీపంలో మరమ్మతుల కోసం విద్యుత్‌స్తంభం ఎక్కాడు. షాక్‌కు గురికావడంతో స్తంభంపై నుంచి కిందపడ్డాడు. దీంతో తీవ్రగాయాలు గాయాలయ్యాయి. స్పృహకోల్పోయిన క్షతగాత్రుడిని వైద్యశాలకు తరలించేందుకు ఆటోలో తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతునికి భార్య శివకుమారి, నలుగురు పిల్లలు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి.సురేష్ తెలిపారు.

తెలుగు మహిళల్లో వర్గ పోరు

పెదకూరపాడు: పెదకూరపాడు మండల తెలుగు మహిళ నాయకురాళ్లలో వర్గ పోరు తారా స్థాయికి చేరింది. గత కొంత కాలంగా తెలుగు దేశం మహిళ నాయకురాళ్ల మధ్య అంతర్గతంగా ఉన్న విభేదాలు సోషల్ మిడియా సాక్షిగా బయట పడ్డాయి. మండలంలోని హుస్సేన్‌నగరం గ్రామానికి చెందిన ఆరుమల్ల సుజాత పల్నాడు జిల్లా తెలుగు మహిళ కార్యదర్శిగా ఉన్నారు. పల్నాడు జిల్లా తెలుగు మహిళ కార్యనిర్వాహక కార్యదర్శిగా ఉన్న షేక్ ముంతాజ్ మధ్య విభేదాలు చాలా కాలంగా నడుస్తున్నాయి. ఈ క్రమంలో షేక్ ముంతాజ్‌పై సోషల్ మిడియాలో సుజాత ఆరోపణలు చేయడంతో షేక్ ముంతాజ్ మరో ముగ్గురుతో కలిసి హుస్సేన్ నగరం గ్రామంలో ఉన్న ఆరిమల్ల సుజాత ఇంటికి వెళ్లి దాడి చేసి తన ఫోను తీసుకెళ్లి, తనను దుర్భాశలాడినట్లు పెదకూరపాడు పోలీసుస్టేషన్‌లో సుజాత ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో విచారించిన పోలీసులు మూడు సెక్షన్లు కింద షేక్ ముంతాజ్‌తో పాటు మరో ముగ్గురుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకట కృష్ణారావు తెలిపారు.

సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు

- దేశం మెచ్చేలా రాష్ట్రంలో సంక్షేమ పాలన
- మంత్రి అంబటి రాంబాబు



29వ వార్డులో యువకుడి చేకూరిన లబ్ధిని వివరిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: రాష్ట్రంలోని పేదల అభివృద్ధే ధ్యేయంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్న సీఎం వైఎస్‌జగన్‌మోహన్ రెడ్డికి ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని మూడవ సచివాలయ పరిధిలోని 29వ వార్డులో బుధవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ కులాలు, మతాలు, ప్రాంతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల అమలులో ఒక్క అవినీతి ఆరోపణ లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి కోట్ల రూపాయలు జమచేసి గత మూడేళ్లలో 95 శాతం పైగా హామీలను సీఎం జగన్ అమలు చేశారన్నారు. దేశం మెచ్చేలా సంక్షేమ, అభివృద్ధి పాలన సాగిస్తున్నారని, పది కాలాల పాటు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండాలని ప్రజలంతా ఆకాంక్షిస్తున్నారన్నారు. పేదలకు మేలు చేయాలని తపనతో సీఎం జగన్ మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే ... చంద్రబాబు కుట్రలు చేస్తూ అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో కేవలం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు మాత్రమే సంక్షేమ పథకాలు అందజేశారన్నారు. టీడీపీ హయాంలో ఐదేళ్లపాటు రూ 2.40 లక్షల కోట్లు అప్పులు చేసిన చంద్రబాబు అప్పుడు పేదలకు అమలు చేసిన ఒక్క సంక్షేమ పథకాన్ని చెప్పగలరా? అని ప్రశ్నించారు. నేడు సీఎం జగనన్న మహిళలు, రైతులు, యువత, అన్ని వర్గాల కోసం సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే అప్పుల పాలవుతుందని గగ్గోలు పెడుతున్నారని విమర్శించారు. ప్రజలు ఇవన్నీ నిశితంగా గమనిస్తున్నారని మరోసారి చంద్రబాబుకు భంగపాటు తప్పదన్నారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు వస్తున్నాయా? ఏమైనా సమస్యలు ఉన్నాయా? అంటూ అడిగి తెలుసుకున్నారు. ఏదైనా సాంకేతిక లోపంతో పథకాలు అందకపోతే అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు మంజూరు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పేదల కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ఆశీర్వదించాలని ఆయన కోరారు. మొత్తం 336 కుటుంబాలను సందర్శించారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, వైస్ చైర్మన్లు షేక్ నాగూర్ మీరాన్,రమావత్ కోటేశ్వరరావు నాయక్, నాయకులు అచ్యుత శివప్రసాద్, షేక్ మౌలాలి (సహరా), కమిషనర్ కొలిమి షమ్మి, పలు వార్డుల కౌన్సిలర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, తదితరులు ఉన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలపై సమీక్ష



మహాశివరాత్రి ఉత్సవాల మూడవ సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకరరావు

అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతిలో వేంచేసియున్న శ్రీబాలచాముండికా సమేత అమరేశ్వర స్వామి వారి దేవస్థానంలో మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా సామాన్య భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అధికారులు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని స్థానిక శాసన సభ్యుడు నంబూరు శంకరరావు అధికారులను ఆదేశించారు. బుధవారం అమరేశ్వరాలయంలో నిర్వహించిన మహాశివరాత్రి ఉత్సవాల మొదటి సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈసమీక్షకు ఆలయ ఈఓ సునీల్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఆసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవాలయ అధికారులతో మిగిలిన అన్ని శాఖల అధికారులు సమన్వయంలో విధులు నిర్వర్తించాలన్నారు. ఈ ఉత్సవాల్లో ముఖ్యమైన మూడురోజులు జిల్లా స్థాయి ఉన్నతాధికారులు ఉత్సవ ఏర్పాట్లను తానుకూడా పర్యవేక్షిస్తారన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులందరూ సమన్వయంతో ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. ఈసందర్భంగా సమీక్ష సమావేశంలో ఉత్సవాల్లో శాంతి భద్రతలను కాపాడటంకోసం 200 మంది పోలీసులతో పటిష్టచర్యలను తీసుకుంటున్నట్లు సీఐ శివప్రసాద్ తెలిపారు. దేవాలయంలో అదనంగా విద్యుత్ లైట్లను ఏర్పాటు చేస్తామని, అలాగే విద్యుత్ లైట్లతో అలంకరణ చేస్తున్నామని అందుకు ఆపద్ధర్మంగా 60 కెవీ.జనరేటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ ఈఓ సునీల్‌కుమార్ తెలిపారు. పారిశుద్ధ్య నిర్వాహణకు ప్రత్యేక సిబ్బంది, కృష్ణానది ఒడ్డున 10 తాత్కాలిక బట్టలు మార్చుకునే గదులను ఏర్పాటు చేస్తున్నామని పంచాయతీ కార్యదర్శి నాగరాజు తెలిపారు. ప్రమాదాలు జరుగుకుండా నదిలో పడవలను ఏర్పాటు చేసి వాటిపై గజ ఈతగాళ్ళను నియమిస్తున్నామని ఫీషరీస్‌శాఖ తెలిపింది. ప్రభుత్వ విధి విధానాల అనుగుణంగా ఎక్సైజ్‌శాఖ డ్రైడేలను ప్రకటిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ శివరాత్రి ఉత్సవఅధికారి డి.శ్రీనివాస్‌రావు సత్తెనపల్లి ఆర్డీఓ రాజకు మారి, తహసీల్దార్ విజయశ్రీ, ఎంపీడీఓ మాధురి, జెడ్పీటీసీ కరుణకుమారి, జెడ్పీకో అప్షన్ మెంబరు హామ్మ్, గ్రామసర్పంచ్ రాజేశ్వరి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థినికి ఎమ్మెల్యే ఆర్థిక సహాయం



ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పుష్పగుచ్ఛం అందజేసిన వైద్యవిద్యార్థిని మధుశ్రీ, ఆమె తల్లిదండ్రులు

క్రోసూరు: వైద్యవిద్య కొనసాగించడంలో కలిగిన ఆర్థిక ఇబ్బందులు తెలుసుకుని హాస్టల్ ఫీజు చెల్లించి చదువుకు ఆటంకం కలుగుకుండా తోడ్పడిన ఎమ్మెల్యే నంబూరు శంకరరావును బుధవారం కలుసుకుని వైద్యవిద్యార్థిని మధుశ్రీ, ఆమె తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు. క్రోసూరుకు చెందిన మక్కెన శ్రీనివాసరావు, శివపార్వతి, వారి కుమార్తె మధుశ్రీ గుంటూరులోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి కలుసుకుని కృతజ్ఞతలు తెలియజేశారు. వైద్యవిద్యార్థిని మధుశ్రీ రాజమండ్రిలోని సీఎస్ఎల్ మెడికాలేజీలో ఎంబీబీఎస్ చదువుతోంది. ఆమె తండ్రికి పక్షవాతం రావడంతో హాస్టల్ ఫీజు చెల్లించలేకపోయింది. దీంతో కాలేజీ నుంచి ఇంటికి పంపించడం జరిగింది. తీవ్రమనోవేదనలో ఉన్న సమయంలోనే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు విద్యార్థిని ఇంటికి వెళ్లి సమస్యను తెలుసుకొన్నారు. వెంటనే కాలేజీ యాజమాన్యంతో మాట్లాడి తన సొంత డబ్బులతో హాస్టల్‌ఫీజు రూ.4 లక్షలు చెల్లించడం జరిగింది. తన చదువుకు ఆటంకం కలుగుకుండా పెద్దమనసుతో ఆదుకున్న ఎమ్మెల్యే దంపతులకు తాము ఎల్లప్పుడు రుణపడి ఉంటామని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మధుశ్రీ బాగా చదువుకుని భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడే పనులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెలది అప్పారావు, నాయకులు పాశంశ్రీనివాసరెడ్డి, షేక్ గఫ్గ్రార్, షేక్ ఖాదర్, అడితి ముస్తాఫా, బయ్యవరం మస్తాన్‌రావు, తదితర నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల ద్వారా ఎక్కువ ఆదాయం పొందాలి



సదస్సులో అవగాహన కల్పిస్తున్న మల్లెల చిన్నప్ప

సత్తెనపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఉపాధి హామీ పథకం పనుల నుగ్రామాల్లో ఉన్న సన్న, చిన్న, పేద వ్యవసాయ కూలి పనులు చేసుకొంటూ మరల ఉపాధి హామీ పథకం పనులు కూడా ఉపయోగించుకొని ఎక్కువ ఆదాయం పొందాలని డీబీఆర్సీ ఉమ్మడి గుంటూరు జిల్లా కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప అన్నారు. సత్తెనపల్లి మండలం కంకణాలపల్లిలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలపై ఎస్సీ, ఎస్టీ రైతులకు బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన అధ్యక్షత వహించారు. చిన్నప్ప మాట్లాడుతూ పురుషులు, మహిళలు వీలైనంత ఎక్కువ మంది ఉపాధి పనులకు రావాలని, రైతులకు ప్రభుత్వం ఇస్తున్న పథకాలను ఉపయోగించుకోవాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ గుజ్జర్లపూడి వీరయ్య మాట్లాడుతూ సన్న, చిన్న,పేద వ్యవసాయ కూలీలు ఉపాధి హామీ పథకం పనులను ఉపయోగించుకొని ఆదాయాన్ని పెంచుకోవడానికి ఉపాధి హామీ పనులకు రావాలని అవగాహన కల్పించారు. సదస్సులో ఎస్సీ, ఎస్టీ రైతులు, సన్న, చిన్న, పేద ప్రజలు పాల్గొన్నారు.

పథకాలపై ఆదివాసీలకు అవగాహన



మాట్లాడుతున్న మేడే వెంకట రమణ

సత్తెనపల్లి: ప్రభుత్వం దళిత, గిరిజన మహిళా సంఘాలను ఆర్థికంగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో ఉన్నతి పథకం ద్వారా రుణాలు మంజూరు చేస్తోందని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ కోఆర్డినేటర్ మేడే వెంకటరమణ అన్నారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో పట్టణంలోని 16 వార్డు చెంచు కాలనీ కమ్యూనిటీ హాల్‌లో దళిత, ఆదివాసి మహిళలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. వెంకటరమణ మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన రుణాలతో యూనిట్లు ఏర్పాటు చేసి ఆర్థికంగా ఎదగాలన్నారు. బ్యాంకు లింకేజీ, శ్రీనిధి, చేదోడు, చేయూత, రుణమాఫీ ప్రభుత్వం ఇస్తోందని వాటిని ఉపయోగించుకుని మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలని అదే విధంగా సంక్షేమం, అభివృద్ధి, రక్షణ చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. మీ పిల్లలను బడికి పంపించి అమ్మఒడి పొందాలని, ప్రభుత్వం ఇళ్ల నిర్మాణం చేపడుతుందని దానిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం ఇచ్చినటువంటి రుణాలను తిరిగి చెల్లించి మీరు ఆర్థిక అభివృద్ధిని సాధించాలన్నారు. ఏఎస్ఎం అంజలి దేవి మాట్లాడుతూ దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో దళిత, గిరిజన మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించిన నాడు మాత్రమే దళిత గిరిజన మహిళా సాధికారత సాధ్యపడుతుందన్నారు. సదస్సులో డీబీఆర్సీ ప్రతినిధులు పినపాటి ఈశ్వరి, ఆశ వర్కర్ సీహెచ్ ప్రమీల, మహిళలు, పాల్గొన్నారు.

సహాయ ఎలక్ట్రీషియన్‌గా నైపుణ్యత శిక్షణ

క్రోసూరు: ఏపి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సహాయ ఎలక్ట్రీషియన్ గా శిక్షణనిచ్చి, నియోజకవర్గంలో ఉద్యోగవకాశాలు కల్పిస్తున్నట్లు స్కిల్ కోఆర్డినేటర్ బంకా మహీదర్ బుధవారం ఒక ప్రటనలో తెలిపారు. కావున శిక్షణలో చేరదలుచుకున్న అభ్యర్థులు క్రోసూరు పాలిటెక్నిక్ కళాశాలలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఉచిత శిక్షణ తరువాత నియోజకవర్గంలోని కంపెనీలు, పరిశ్రమల్లో ప్లేస్‌మెంట్ కల్పించబడుతుందని వివరించారు. వివరాలకు : 9966985773, 80743 93466కు ఫోను చేసి తెలుసుకోవచ్చునన్నారు.

28లోపు జీవన ప్రమాణ పత్రాలు అందించాలి

సత్తెనపల్లి: పెన్షనర్లు అందరూ ఈ నెల 28 లోపు జీవన ప్రమాణ పత్రాలు సబ్ ట్రజరీ అధికారి (ఎస్టీవో) కార్యాలయంలో అందచేయాలని ఏపీ పెన్షనర్స్ అసోసియేషన్ సత్తెనపల్లి యూనిట్ సెక్రటరీ రొంపిచర్ల పురుషోత్తం బుధవారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్ దారులందరూ వెంటనే స్పందించి సకాలంలో అందించాలని ఆయన కోరారు.

కేంద్ర బడ్జెట్‌పై అవగాహన సదస్సు

క్రోసూరు: క్రోసూరులోని కటకం కల్యాణ మండపంలో సాయంత్రం 4 గంటలకు గురువారం బీజేపీ ఆధ్వర్యంలో 2023-24 బడ్జెట్ పై అవగాహన సదస్సు జరుగుతుందని ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు పక్కాల సూరిబాబు బుధవారం తెలిపారు. ముఖ్యఅతిథులుగా పార్టీ జిల్లా అధ్యక్షులు ఆలోకం సుధాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవిశంకర్, గురజాల నియోజకవర్గ ఇన్‌చార్జి నవకుమార్, హాజరవుతారని తెలిపారు. కావున ప్రజలు, పార్టీ నాయకులు తప్పక పాల్గొనాలని కోరారు.

నేడు 27వ వార్డులో గడప గడపకు ప్రభుత్వం

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం పట్టణంలోని 3వ సచివాలయ పరిధిలోని (అచ్చంపేట రోడ్) 27వ వార్డులో గురువారం ఉదయం 6 గంటలకు జరుగుతుందని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు బుధవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు హాజరుకావాలని కోరారు.

పీహెచ్‌సీని విజిట్ చేసిన విజిలెన్స్ అధికారులు

క్రోసూరు: క్రోసూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని విజిలెన్స్ అధికారులు బుధవారం సందర్శించారని పీహెచ్‌సీ వైద్యురాలు అనూన్య తెలిపారు. నాడు నేడు కార్యక్రమంలో పీహెచ్‌సీలో నూతనంగా జరిగిన నిర్మాణ పనుల తీరుతెన్నులు పరిశీలించారు. అదేవిధంగా పీహెచ్‌సీలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయా , స్టాఫ్ అందరూ ఉన్నారా అనే విషయాలు తెలుసుకుని వెళ్లినట్లు వైద్యురాలు తెలిపారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవం

అచ్చంపేట: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలు ఆవరణలో అచ్చంపేట మండల ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నూతన కార్యవర్గం బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికై ంది. గౌరవాధ్యక్షులుగా టి.శౌరెడ్డి, అధ్యక్షులుగా కె.ప్రకాశరావు, సహాధ్యక్షులుగా వి.సత్యనారాయణ, కె.లలిత, ప్రధాన కార్యదర్శిగా ఎ.వెంకటేశ్వరరావు, కోశాధికారిగా కె.నాగరాజు, కార్యదర్శులుగా పెద హుస్సేన్, భార్గవ్, వెంకటరావు, భాషా, బాలశౌరెడ్డి, కె.రాజేంద్ర, వి.వి.లక్ష్మి, బద్రూనాయక్, జిల్లా కౌన్సిలర్స్‌గా యం.శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాసరావు, షేక్ ఖాజావలి, పి.సుజాత ఎన్నికైనారు.

జనన,మరణ అంశాలను నమోదు చేయించాలి



మాట్లాడుతున్న ప్యానల్ న్యాయవాది దివ్వెల, న్యాయవాదులు

సత్తెనపల్లి: సమాజంలో ప్రతి వ్యక్తి తన కుటుంబంలోని జనన,మరణ అంశాలను నమోదు చేయించాలని ప్యానల్ న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు సత్తెనపల్లి మండల న్యాయసేవధికార కమిటీ చైర్మన్, సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి డీ. నాగవెంకటలక్ష్మి సూచనల మేరకు సత్తెనపల్లి మున్సిపల్ కార్యాలయంలో మండల న్యాయసేవాధికార కమిటీ ఆధ్వర్యంలో జనన, మరణ నమోదు పై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. దివ్వెల మాట్లాడుతూ సకాలంలో విధిగా వాటిని పొందాలన్నారు. సంబంధిత మున్సిపల్ సిబ్బంది ఆ దిశగా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. మున్సిపల్ కార్యాలయ మేనేజర్ సాంబశివరావు, ప్యానల్ న్యాయ వాదులు సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శక పాలనకు ప్రజామద్దతు

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



లబ్ధిదారులకు పథకాల కరపత్రాలు అందిస్తు వారితో మాట్లాడుతు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

క్రోసూరు: అవినీతి లేని పాలనకు ప్రజల మద్దతు ఉంటుందని అది ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. బుధవారం క్రోసూరు సచివాలయం -2 పరిధిలోని ఇంటింటికీ వెళ్లి ఎమ్మెల్యే ప్రజల్ని పలకరించారు. మహిళలు, స్థానికులు ఎమ్మెల్యేను ఘనంగా స్వాగతించారు. ఈసందర్భంగా నవరత్నాల లబ్ధిదారులకు కరపత్రాలు అందచేసి, ఇంకా ఏమైనా సమస్యలున్నాయని అడిగి తెలుసుకుని పరిష్కరించే విధంగా అక్కడిక్కడ అధికారులను ఆదేశించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మూడేన్నరేళ్లలో అన్ని వర్గాలకు సంక్షేమం అందించడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. తాము చేసిన దాంట్లో కనీసం 10 శాతమైనా గత టీడీపీ ప్రభుత్వం చేసిందా అని ప్రశ్నించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ ఫలాల వల్ల పేదల జీవితాల్లో వెలుగులు విరబూస్తున్నాయన్నారు. క్రోసూరు సచివాలయం-2 పరిధిలో రూ.10.69 కోట్ల సంక్షేమ పథకాలు అమలు చేసామన్నారు. గత ప్రభుత్వాల హయాంలో ఏదైనా పనిజరగాలంటే లంచాలు ఇవ్వాల్సిన దుస్థితి ఉండేదన్నారు. కానీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజల ముంగిటకే పరిపాలన తీసుకురావడం జరిగిందన్నారు. ప్రతి గ్రామంలో సచివాలయం, రైతుభరోసాకేంద్రం, వెల్‌నెస్‌సెంటర్లు ఏర్పాటు చేసి అన్ని సౌకర్యాలను పేదల ముంగిటకు తీసుకురావడం జరిగిందన్నారు. దేశచరిత్రలో ఏక్కడా లేని విధంగా సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా నిలిచి ఆశ్వీరదించాలని కోరారు. తాను ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని, ఎటువంటి సమస్య వచ్చినా తనను కలుసుకోవచ్చునని అన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మల్లా చందమామ, ఎంపీపీ పి.కోటయ్య, జెడ్పీటీసీ షేక్ జమీలా,అచ్చంపేట జెడ్పీటీసీ టి.విజయప్రతాప్‌రెడ్డి, షేక్ గఫూర్,షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మస్తాన్, తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు అనుములకోటిరెడ్డి, జూనియర్ వెంకట్రావు, షేక్ ఖాదర్, పాశంశ్రీనివాసరెడ్డి, మాజీ యార్డు చైర్మన్ డాక్టర్ షరీఫ్, మాజీ యార్డు డైరక్టర్ అంబటినారాయణ,దేశిరెడ్డి సత్యనారాయణరెడ్డి, రాష్ట్ర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి గార్లపాటిదాసు, కేశవరెడ్డి, మండల కన్వీనర్ వెలది అప్పారావు, మేదరరోశయ్య, షేక్ షుకుర్, ఇన్‌చార్జి ఎంపీడీఓ పి.శివరామయ్య, వీఆర్వో జిలాని, పంచాయతీ కార్యదర్శి శరత్‌కుమార్, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, రెవెన్యూ అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

పలువురు వైఎస్సార్ సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

బెల్లంకొండ: కలిసి పనిచేద్దాం.. అభివృద్ధి బాటలో నడుద్దామని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. బుధవారం మండలంలోని వన్నాయపాలెం గ్రామానికి చెందిన 50 కుటుంబాలకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. గుంటూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు మేకల వాసు, మేకల పుల్లారావు, కోటేశు, మేకల సాంబశివరావు, జంపాని హనుమంతరావు, అత్తి శ్రీనివాసరావు, బాదరబోయిన రామయ్య, గాదం రామారావు, దేవాంగుల పెదకొండలు, షేక్ పెదనన్నే సాహెబ్, దేవండ్ల వెంకటయ్య, కొమ్మవరపు బ్రహ్మం, ప్రత్తిపాటి జగన్నాధం, రంగయ్య, మేకల పెదవెంకటేశ్వర్లు, దాసరి గరటయ్య, బొప్పూడి లక్ష్మీ, ప్రత్తిపాటి రాజేశ్వరి, షేక్ నబీ, మేకల ఆదెమ్మ కుటంబాలకు చెందిన వారు పార్టీలో చేరారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న పథకాలు, నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే శంకరరావు చేస్తున్న కృషికి ఆకర్షితులమై పార్టీలో చేరుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చెన్నుపురెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి, గ్రామ నాయకులు మేకల వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య, సాంబశివరావు పాల్గొన్నారు.

పారుపలుకి చేసిన అభివృద్ధి కనబడడం లేదా !

పారుపల్లి(క్రోసూరు:): మండలంలోని పారుపల్లి గ్రామ శివారు అభివృద్ధికి నోచుకోలేదన్న ఈనాడు పత్రిక రాసిన వార్తలో ఏమాత్రం వాస్తవం లేదని, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆధ్వర్యంలో గ్రామానికి చేసిన అభివృద్ధి పనులు తెలుసుకోవాలని గ్రామస్తులు బుధవారం విలేకరుల సమావేశంలో విమర్శించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆధ్వర్యంలో గ్రామంలో ప్రజలకు తాగునీటి కోసం మినరల్‌వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మురుగునీటి సమస్య పరిష్కారానికి రూ.10 లక్షలతో డ్రైయిన్స్ నిర్మించడం జరిగిందన్నారు. సుమారు రూ.20 లక్షలతో అంతర్గరహదారులు నిర్మించడం జరిగిందన్నారు. అలాగే నాడు-నేడు కింద రూ.10 లక్షలతో పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణం, టాయిలెట్లు నిర్మిణాలు జరుగుతున్నాయన్నారు. అదేవిధంగా 800 మంది జనాభా ఉన్న పారుపల్లిగ్రామానికి రూ.40 లక్షల రూపాయల వివిధ అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. అదేవిధంగ అర్హులైనందరికీ నవరత్నాల సంక్షేమ ఫలాలు అందించడం జరిగిందన్నారు. వీటన్నింటినీ తెలుసుకోకుండా అభివృద్ధి జరగలేదని రాయడం శోచనీయమని అన్నారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ విప్పల వెంకట్రామిరెడ్డి, గ్రామ ఉపసర్పంచ్ ఎం. ముత్తయ్య, పారుపల్లి మధు, పారుపల్లి అంజయ్య, సచివాలయ సమన్వయకర్త విప్పల రాజశేఖరరెడ్డి తదితరులున్నారు.

అత్తలూరు చర్చి వ్యవస్థాపక దినోత్సవం



సమిష్టి దివ్య పూజాబలి నిర్వహిస్తున్న విచారణ గురువులు

అమరావతి: అత్తలూరు గ్రామంలో అత్యంత పురాతనమైన పునీత తోమాసవారి చర్చిలో బుధవారం వైభవంగా చర్చి వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. ఉదయాన్నే ప్రార్థనా కార్యక్రమాల్లో భాగంగా గుంటూరు మేత్రాసనం బిషప్ చింతాబత్తిన భాగ్యయ్యతో పాటుగా జిల్లా వ్యాప్తంగా పలు చర్చిల నుంచి వచ్చిన 40 మంది విచారణ గురువులతో సమిష్టి దివ్య పూజాబలి కార్యక్రమాన్ని నిర్వహించారు. అత్తలూర చర్చిలో ప్రతియేటా సంప్రదాయబద్ధంగా దివ్యపూజాబలి కార్యక్రమాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈసందర్భంగా మండలంలో పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా అత్తలూరు తోమాస చర్చి ఫాదర్ శరత్ మాట్లాడుతూ అందరూ దైవం పట్ల విశ్వాసంతో తోటి మానవుల పట్ల కరుణతో జీవించాలన్నారు. కార్యక్రమంలో విచారణ గురువులు, మఠకన్యలు, విచారణ క్రైస్తవులతో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఏరియావైద్యశాలలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సేవలు

సత్తెనపల్లి: పట్టణంలోని ఏరియా వైద్యశాలలో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ సేవలు అన్ని విభాగాలకు వర్తింప చేసి సమర్థవంతంగా అందిస్తున్నట్లు ఏరియా వైద్యశాల సూపరింటెంట్ డాక్టర్ ఈటి పోగు వెంకట్రావు చెప్పారు. బుధవారం వైద్యశాలలో బాలింతకు మందులు, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సర్టిఫికెట్ అందించిన అనంతరం ఆయన మాట్లాడారు. డాక్టర్ వెంకట్రావు మాట్లాడుతూ నాడు ఆరోగ్యశ్రీ సేవలు కేవలం గర్భిణులకు మాత్రమే ఉండేవని నేడు వైఎస్సార్ ఆరోగ్య శ్రీ సేవలు అన్ని విభాగాలకు అంటే గైనిక్, ఆర్థోపెటిక్, ఆప్తమాలజీ, ఈఎన్‌టి, జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ రిజిస్ట్రేషన్ అయ్యిందన్నారు. వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు కొత్త రామకృష్ణ మాట్లాడుతూ ముఖ్యంగా వైద్యశాలలో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ కూడా వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద వర్తింపజేశామని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పూర్తయిన తర్వాత రోగి యొక్క ఖాతాల్లో వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా నేరుగా రోగి ఖాతాల్లోనే నగదు జమ అవుతుందన్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం సమర్థవంతంగా అమలవుతుందో లేదో అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ద్వారా ఉత్తమ చికిత్స అందించాలని ఆరోగ్యశ్రీ, ఆరోగ్య మిత్ర సిబ్బందికి సూచనలు అందించారు. కార్యక్రమంలో వైద్యశాల సిబ్బంది, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సిబ్బంది పాల్గొన్నారు.